# నేడు హాలియాకు సీఎం కేసీఆర్

## బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

**బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు**

**స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు సన్నద్ధం**

**ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు హాలియాకు రానున్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుముల గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా ఆశ్వీరాద సభలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. సీఎం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. హాలియా-దేవరకొండ ప్రధాన రహదారి వెంట అనుముల గ్రామంలో 10 ఎకరాల స్థలాన్ని జేసీబీలు, డోజర్లతో శుభ్రం చేయడంతోపాటు సభకు వచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు ఇబ్బంది కలుగకుండా మరో 10 ఎకరాలను కూడా శుభ్రం చేయించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బహిరంగ సభ జరుగనున్నందున సభకు హాజరయ్యే మహిళలు, వృద్ధులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు వేశారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచంద్‌నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి పరిశీలించారు.

– హాలియా, నవంబర్ 13



హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుములలో ముఖ్యమంత్రి బహిరంగ సభాస్థలి

### హాజరుకానున్న సుమారు లక్ష మంది..

2018 శాసనసభ ఎన్నికలతోపాటు 2021లో జరిగిన నాగార్జునసాగర్ నియోజకవర్గ ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారు. హాలియాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంజారా భవన్ ఏర్పాటు, నాగార్జునసాగర్ ఎన్ఎస్పీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారికే క్వార్టర్స్ కేటాయింపు, నందికొండ మున్సిపాలిటీగా ఏర్పాటు, నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.150 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా ఇప్పటికే నెల్లికల్ లిఫ్ట్ నిర్మాణానికి రూ.684 కోట్లును ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు యుద్ధ ప్రాతిపాదికన జరుగుతున్నాయి. తమ అభిమాన నాయకుడు కేసీఆర్‌ను చూసేందుకు నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే కాకుండా ప్రజలు సైతం స్వచ్ఛందంగా తరలివచ్చే అవకాశం ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా 7 మండలాలు, 2 మున్సిపాలిటీల నుంచి సుమారు లక్ష మంది వరకు తరలివచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సభతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ మరింత పుంజుకునే అవకాశం ఉంది. వారి వెంట జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, ఎంపీపీలు సుమతీపురుషోత్తం, ఆంగోతు భగవాన్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి బోల్లేపల్లి శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకుడు కట్టెబోయిన గురువయ్య ఉన్నారు.

### హెలిప్యాడ్‌ను పరిశీలించిన అధికారులు..

సీఎం కేసీఆర్ సభ నేపథ్యంలో అధికారులు సభకు 300 మీటర్ల దూరంలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా సభకు అర కిలోమీటర్ దూరంలో ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

## వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

**రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్**

**ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డితో కలిసి సభ ఏర్పాట్ల పరిశీలన**

హాలియా, నవంబర్ 13 : రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఎవరైనా మరచిపోయి చెయ్యి గుర్తుకు ఓటేస్తే అది మోరీలో వేసినట్లేనని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుముల గ్రామంలో మంగళవారం జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 40 ఏండ్లుగా జరుగని అభివృద్ధి బీఆర్ఎస్ అధికారంలోనికి వచ్చాక దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, ఆయన కుమారుడు ప్రస్తుల ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. నేడు హాలియాలో ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ ఉన్నందున, తమ అభిమాన నాయకుడు , ముఖ్యమంత్రి కేసీఆర్ రాక కోసం నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. జానారెడ్డి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, 16 ఏండ్లు మంత్రిగా ఉండి ఏమీ చేయలేదని, నోముల భగత్ రెండున్నరేండ్లలోనే ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. రూ.650 కోట్లతో నెల్లికల్ లిఫ్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జానారెడ్డికి అధికార దాహం, పదవీ వ్యామోహం తప్పా ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో 15మంది ముఖ్యమంత్రి రేసులో ఉన్నారని, అదే బీఆర్ఎస్‌లో సీఎం అభ్యర్థి కేసీఆర్ ఒక్కరేనని పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్ పార్టీ కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే నోముల భగత్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.



హాలియాలో మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్

# 73నామినేషన్ల తిరస్కరణ

## ముగిసిన నామినేషన్ల పరిశీలన

- బరిలో 355మంది అభ్యర్థులు
- రేపటి వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం తుది దశకు చేరుకున్నది. సోమవారం నామినేషన్ల పరిశీలన పూర్తయింది. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 428 మంది అభ్యర్థులు 745 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 73 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 355 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఆమోదించారు. ఎవరైనా పోటీ నుంచి తప్పుకోవాలంటే తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి నేడు, రేపు గడువు ఉన్నది. బుధవారం మధ్యాహ్నం 3గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితా వెల్లడి కానుంది. అదే రోజు ఈవీఎంలలో అభ్యర్థుల పేర్లు, వారి గుర్తుల వరుస క్రమం ఖరారు చేయనున్నారు. దీంతో అభ్యర్థులంతా ఇదే ప్రకారంగా నమూనా బ్యాలెట్‌ను రూపొందించి ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలో రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలయ్యాయి. 12నియోజకవర్గాల్లో ఈ నెల 10 తేదీ వరకు జరిగిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో మొత్తం 428మంది అభ్యర్థులు 745సెట్లు దాఖలు చేశారు. మధ్యలో రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల పరిశీలన చేపట్టారు. ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అభ్యర్థులు, వారి తరఫున ఏజెంట్ల సమక్షంలో ఒక్కో అభ్యర్థి వారీగా నామినేషన్ పత్రాన్ని పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం పత్రాలను పూర్తి చేశారా... అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించారా? ప్రతిపాదకుల సంఖ్య సరిగ్గా ఉందా? అభ్యర్థుల సంతకాలు అన్ని చోట్ల ఉన్నాయా? పార్టీ పేరు పేర్కొంటే అందుకు సంబంధించిన ఫారం-ఏ, ఫారం-బీలు ఉన్నాయా? ఇలాంటి అన్ని విషయాలను పరిశీలించారు. ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వాటిని తిరస్కరిస్తున్నట్లు అక్కడే ప్రకటించారు. అన్ని నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం సక్రమంగా ఉన్న అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు.

### 73 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ..

సోమవారం చేపట్టిన నామినేషన్ల పరిశీలనలో మొత్తం 73 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వీరు పోగా మొత్తం 355 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. నల్లగొండలో 3, నకిరేకల్‌లో 2, మునుగోడులో 1, మిర్యాలగూడలో 12, దేవరకొండలో 5, నాగార్జునసాగర్‌లో 7, తుంగతుర్తిలో 12, సూర్యాపేటలో 10, హుజూర్‌నగర్‌లో 5, కోదాడలో 3, భువనగిరిలో 4, ఆలేరులో 9మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వీరు పోగా మిగతా అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే వీరిలో ఎవరైనా బరిలో నుంచి తప్పుకోవాలనుకుంటే తమ నామినేషన్ల ఉపసంహరణకు రెండు రోజుల గడువు ఉంది. నేడు, రేపు నామినేషన్ల ఉపసంహరణ కొనసాగనుంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశముంది. తర్వాత బరిలో నిలిచిన తుది జాబితాను జాతీయ పార్టీలు, రాష్ట్ర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులను వరుస క్రమంలో నియోజకవర్గాల వారీగా అధికారులు వెల్లడించనున్నారు. దీని ప్రకారమే ఈవీఎం బ్యాలెట్‌లో అభ్యర్థుల పేర్లు క్రమ సంఖ్యలో పొందుపర్చనున్నారు. దీన్నే నమూనా బ్యాలెట్‌గా తీసుకుని అభ్యర్థులు ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించనున్నారు.

### నియోజకవర్గాల వారీగా నామినేషన్ల సంఖ్య

| నియోజకవర్గం | అభ్యర్థుల సంఖ్య | తిరస్కరణ | మిగిలింది |
|---|---|---|---|
| నల్లగొండ | 39 | 3 | 36 |
| నకిరేకల్ | 33 | 2 | 31 |
| మిర్యాలగూడ | 45 | 12 | 33 |
| నాగార్జునసాగర్ | 28 | 7 | 21 |
| దేవరకొండ | 18 | 5 | 13 |
| మునుగోడు | 51 | 1 | 50 |
| సూర్యాపేట | 42 | 10 | 32 |
| తుంగతుర్తి | 33 | 12 | 21 |
| కోదాడ | 39 | 3 | 36 |
| హుజూర్‌నగర్ | 40 | 5 | 35 |
| భువనగిరి | 29 | 4 | 25 |
| ఆలేరు | 31 | 9 | 22 |
| మొత్తం | 428 | 73 | 355 |